


సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, వేదికపై బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు





మాట్లాడుతున్న చింతా ప్రభాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్

# కాంగ్రెస్‌కు ఓట్లేసి కష్టాలు తెచ్చుకోవద్దు

బీఆర్‌ఎస్ కార్యకర్తలు కదన సింహాల్లా కదిలిరావాలి

- ఎమ్మెల్యే జగ్గారెడ్డి మొసలి కన్నీళ్ల కు ప్రజలు మోసపోవద్దు
- ఎమ్మెల్యే గల్లీకో ఏటీఎం ఎక్కడ కనిపిస్తున్నాయ్..
- మాయమాటలతో ఓట్లు దండుకునే నైజం కాంగ్రెస్‌ది
- తెలంగాణ ద్రోహి జగ్గారెడ్డికి గుణపాఠం చెప్పాలి
- రూ.400లకే ఇంటింటికీ గ్యాస్ సిలిండర్

చింతా ప్రభాకర్ కృషితోనే మెడికల్ కళాశాల మంజూరు

- మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు
- పోతిరెడ్డిపల్లిలో సంగారెడ్డి నియోజకవర్గ పార్టీ నాయకులతో సమావేశం
- పలువురు బీజేపీ, కాంగ్రెస్, బీసీసంఘం నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



సంగారెడ్డిలో సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

సంగారెడ్డి, నవంబరు 3: బీఆర్‌ఎస్ కార్యకర్తలు కదన సింహాల్లా కదన రంగలోకి దూకితే కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గాల్లో కొట్టుకుపోతారని, కాంగ్రెస్‌కు ఓట్లు వేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లి పీఎస్‌ఆర్ గార్డెన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గంలోని బూత్ కమిటీలు, వంద ఓటర్ల ఇన్‌చార్జిలు, గ్రామాధ్యక్షులు, పార్టీ నాయకులతో మంత్రి హరీశ్‌రావు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ, కాంగ్రెస్, బీసీసంఘం నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేశారు. వారికి గులాబీ కండువాలు కప్పి మంత్రి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇటీవల పక్కరాష్ట్రం కర్ణాటకలో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ గెలిచిందని, అప్పుడే అక్కడ కరెంటు కష్టాలు మొదలయ్యాయన్నారు. తెలంగాణకు సరిహద్దులో ఉన్న కర్ణాటక ప్రజలు నారాయణఖేడ్‌కు వచ్చి కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మొద్దని ప్రచారం చేస్తున్నారన్నారు. సంగారెడ్డిలో చింతా ప్రభాకర్ కృషితోనే మెడికల్ కళాశాల మంజూరైందన్నారు. సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల ప్రజల దహోర్తిని దూరం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. మాయమాటలతో కాంగ్రెస్ పార్టీ మరొక్కసారి ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకునేందుకు ప్రజలను మభ్యపెడుతుందన్నారు. తెలంగాణ ద్రోహులకు గుణపాఠం చెప్పే సమయం వచ్చిందని, ఎమ్మెల్యే జగ్గారెడ్డి మొసలికన్నీళ్లకు ప్రజలు మోసపోవద్దని సూచించారు. గత ఎన్నికల్లో జగ్గారెడ్డి నియోజకవర్గంలో గల్లీకో ఏటీఎం పెట్టి డబ్బులు తీసుకునే విధంగా ప్రారంభిస్తానని, చెప్పిన మాటలు అమలు చేశారా అని మంత్రి ప్రశ్నించారు. జగ్గారెడ్డి గెలిచిన తర్వాత సంగారెడ్డి ప్రజల కష్టాలు పట్టించుకోలేదన్నారు. ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.

### రూ.400లకే గ్యాస్ సిలిండర్

బీజేపీ ప్రభుత్వం రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.వెయ్యికి పెంచి ప్రజల నడ్డివిరిచిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో గెలుపొందగానే వంట గ్యాస్‌ను రూ.400లకే అందజేస్తుందన్నారు. కేసీఆర్ బీమాతో భూమిలేని పేదలకు రాష్ట్రవ్యాప్తంగా కోటి కుటుంబాలకు కేసీఆర్ ధీమాను అందజేసే పథకం ప్రారంభిస్తామన్నారు. అలాగే మహిళల కోసం సౌభాగ్యలక్ష్మి పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభి అందజేస్తారన్నారు. ప్రస్తుతం రైతులు మృతి చెందితే పది రోజుల్లో రూ.5లక్షల బీమాను రైతు కుటంబానికి అందజేస్తున్నామన్నారు. ఈసారి గెలిస్తే బీమా పథకంతో రూ.15లక్షలను అందజేసే పథకానికి శ్రీకారం చుట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రైతుబంధు సృష్టికర్త సీఎం కేసీఆర్ అని రైతుబంధును రూ.10 వేల నుంచి రూ.16వేలకు పెంచి అందజేస్తామన్నారు. బీజేపీ డకౌట్.. కాంగ్రెస్ రనౌట్.. బీఆర్‌ఎస్‌కుకు సెంచరీ ఖాయమని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు రెండురోజులు ఉండగా జగ్గారెడ్డి పురుగుల మందు డబ్బా పట్టుకుని మోసం చేసే ప్రయత్నం చేస్తారని, వాటిని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. నియోజకవర్గంలో 10వేల మంది పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తామని, అర్హులందరికీ డబుల్‌బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

### ఆశీర్వదించండి.. సేవకుడిగా పనిచేస్తా: చింతా ప్రభాకర్

గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కృషితో కొద్ది మెజార్టీతో ఓటమి చెందానని, ఈసారి ఎన్నికల్లో కార్యకర్తలే నా బలం.. బలగమని బీఆర్‌ఎస్ సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ఓటమి చెందినా ప్రజల మధ్యనే ఉంటూ సేవ చేశానని, కరోనా కష్టకాలంలో బాధితులకు వైద్యసేవలు, నిత్యావసర వస్తువులు, మందులు సరఫరా చేశామన్నారు. ముఖ్యంగా బతుకుదెరువుకు వచ్చిన ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రజలు తనను గెలిపించి అభివృద్ధి, సంక్షేమాన్ని పెంచేందుకు సైనికుల్లా పనిచేసి గెలిపిస్తారని ఆశిస్తున్నానన్నారు. నా ఆరోగ్యం బాగా లేకున్నా.. మీరే నీ ఆరోగ్యం..అని భావించి మీరే అభ్యర్థిగా అనుకుని పనిచేసి గెలిపించాలని ప్రభాకర్ కోరారు. సమావేశంలో నియోజకవర్గ కో-కన్వీనరు పట్నం మాణిక్యం, ఎంఏ ముఖీమ్, శివరాజ్ పాటిల్, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డితోపాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇరవై ఐదు రోజులు కష్టపడితే గెలుపు సాధ్యం: ఎర్రోళ్ల శ్రీనివాస్

ఎన్నికలకు ఇరవై ఐదు రోజులు సమయం ఉందని, ఈ ఇరవై ఐదు రోజులు కష్టపడితే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపు సాధ్యమని టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు వందమంది ఓటర్ల ఇన్‌చార్జులు, బూత్ కమిటీ కన్వీనర్లు ఏబీసీడీలుగా విభజించి ఓటర్లలో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. గెలిచిన అనంతరం అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలన్నారు. వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి బాధ్యత బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేసే విధంగా అన్ని రకాలుగా ప్రజలకు నచ్చజెప్పాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు చింతా ప్రభాకర్ అని ఐదేండ్ల క్రితం గెలిచిన జగ్గారెడ్డి నియోజకవర్గంలోని గ్రామాలకు వెళ్లని సందర్భాలు ఉన్నాయన్నారు. కరోనా కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అవసరమైన వస్తువులు, మందులు, శానిటైజర్లు, మాస్కులు అందజేసి సేవలు చేసిన ప్రభాకర్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు.



## కల్యాణిలక్ష్మి పైసలతో బంగారం కొనిచ్చిన...

అక్కన్నపేట, నవంబర్ 3: నా పేరు గుగులోతు బిచ్చాని, మా భర్త పేరు భీముడు. మాది రాజు తండా. లంబాడోళ్లం. కూలికిపోయి బతేకటోళ్లం. మాకు నలుగురు ఆడ పిల్లలు. వీళ్లకు ఎట్లా పెండ్లి చేయాలనే రంది అయ్యేది. ఉన్న రెండు ఎకరాల భూమిని చేసుకుంటూ, కూలీ, నాలీ, అప్పో, సప్పో చేసి ఆటో, ఇటో పెద్ద బిడ్డ శ్రీలత పెండ్లి చేసినం. తరువాత అంత ఆగం అయింది. 2017లో రెండో బిడ్డ సుమలత, 2018 మూడో బిడ్డ స్వర్ణలత, 2019లో నాల్గో బిడ్డ మంగకు పెండ్లి చేసినం. తాపకుఇంత భూమి అమ్మగా ఇక అర్ధ ఎకరం భూమి మిగిలింది. కేసీఆర్ సారూ దయ వల్ల ముగ్గురు బిడ్డలకు కళ్యాణ లక్ష్మి వచ్చింది. దగ్గరదగ్గర మొత్తం కల్యాణలక్ష్మి పైసలతోనే ముగ్గురు బిడ్డలకు సుమారు 10 తులాలు బంగారం కొనిచ్చిన. ముగ్గురు బిడ్డలను కాన్పులకు సర్కారు దవాఖానలకు తీసుకుపోయిన. కేసీఆర్ కిట్టు వచ్చింది. మాకు కొడుకులు లేనందుకు సీఎం కేసీఆర్ మా ఆడపిల్లలకు తోబుట్టువు అయ్యిండు. చాలా తృప్తి అయ్యింది. సీఎం కేసీఆర్‌కు మా గిరిజన కుటుంబం రుణపడి ఉంటుంది. అంతేకాదు మాకు అన్ని విధాలా సర్కారోళ్ల సాయం అందుతున్నది.

*– గుగులోతు బిచ్చాని, రాజుతండా, దుబ్బాతండా (అక్కన్నపేట)*



ఈ నిరుపేదకు డబుల్‌బెడ్‌రూం దక్కింది. హుస్నాబాద్‌లో డబుల్‌బెడ్‌రూం పొందిన లబ్ధిదారు కడమంచి తిరుపతమ్మ కుటుంబం

## కేసీఆర్ ధర్మాతుడితోనే ఇల్లు వచ్చింది..

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 3: ఇరవై మూడెండ్లనుంచి తండ్లాడుతున్న. మస్తు ఏడిసన. ఇల్లు కావాలని. మేం బొల్లు అమ్ముకునే బతికేటోల్ల బాధలు సెప్పితే ఒడవయి. మేం సంపాయించిది పిల్లగాండ్లకే సరిపోయింది. ఇద్దరు బిడ్డలు, ఒక కొడుకు ఉన్నరు. ఇల్లు జాగలేదు. కొందమంటే భూములు లచ్చలల్ల ఉన్నయి. కొనలేక బాధపడేది. కొనలేక మావోళ్లను బతిలాడి ఈ జాగల కవర్లు ఏసుకోని ఉంటున్నం. సాన రోజులనుంచి సూత్తున్న. మూడేండ్ల కింద దరఖాస్తు పెట్టుకున్న. కేసీఆర్ ధర్మాత్తుడు ఆయనతోనే మాకు ఇల్లు వచ్చింది. ఆయన కడుపు సల్లంగ ఉండ. ఓటు అయితే ఆయనకే ఎత్తం. ఆయన ఏడ ఉన్న ఓట్లు ఆయనకే గంపగుత్తగ ఎత్తం. సీఎంకేసీఆర్ సారు ఇల్లు ఇచ్చిండ్రు. ఇల్లుకోసం ఎవ్వలకు రూపాయికూడ ఇయ్యలేదు. ఎవ్వలను కూడ కలవలే. డబుల్ బెడ్‌రూం వచ్చుడు సాన సంతోషం.

*– తిరుపతమ్మ, డబుల్‌బెడ్‌రూం లబ్దిదారు, హుస్నాబాద్ టౌన్*





ఆలయంలో కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామి మూలవిరాట్

- ఉదయం 10 గంటలకు రానున్న సీఎం కేసీఆర్
- వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు
- ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీకి సెంటిమెంట్ ఆలయంగా ప్రాచుర్యం
- 1985 నుంచి కొనసాగుతున్న సంప్రదాయం
- గత ఏడాది రూ. 3 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం
- మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఘన స్వాగతం పలకనున్న గ్రామస్తులు, పార్టీ శ్రేణులు

# నేడు కోనాయిపల్లికి జనహృదయ నేత




సిద్దిపేట, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నేడు (శనివారం) సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోనున్నారు. తన నామినేషన్ పత్రాలను స్వామివారి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు చేయనున్నారు. రోడ్డు మార్గాన ప్రత్యేక బస్సులో కోనాయిపల్లి వేంకటేశ్వరాలయానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఏర్పాట్లపై స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. కోనాయిపల్లికి సీఎం కేసీఆర్ వస్తున్నందున గ్రామస్తులు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. దశాబ్దాలుగా సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీకి సెంటిమెంట్ దేవాలయం. ఏ శుభకార్యం చేసినా ఇక్కడ పూజలు చేసిన అనంతరమే పనులను ప్రారంభిస్తారు. ప్రతి ఎన్నికల ముందు నామినేషన్ పత్రాలను వేంకటేశ్వరస్వామి చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించడం 1985వ సంవత్సరం నుంచి ఆనవాయితీగా వస్తున్నది. 1989, 1994, 1999, 2001, 2004, 2009 ఎన్నికల నామినేషన్ పత్రాలకు పూజలు నిర్వహించి, నామినేషన్ వేసి విజయం సాధించారు. తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటే ఏకైక లక్ష్యమని ఆనాడు తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వం, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు 2001 ఏప్రిల్ 27న రాజీనామా చేసి, అదేరోజు ఉదయం కోనాయిపల్లి వేంకన్నస్వామి ఆశీర్వాదం తీసుకొని టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించారు. పార్టీ జెండాతో పాటు, సాహిత్యం, పాటల క్యాసెట్లను దేవుడి సన్నిధిలో పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం భారీ కార్ల ర్యాలీతో హైదరాబాద్‌లోని జలదృశ్యంలో పార్టీని ఏర్పాటు చేసి 14 ఏండ్ల తర్వాత తెలంగాణ రాష్టాన్ని సాధించారు. 2004లో తెలంగాణ ప్రాంతంలో పోటీ చేస్తున్న టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల బీ ఫారాలకు పూజలు చేయించి వారికి అందజేశారు. ఆ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్‌కు, సిద్దిపేట అసెంబ్లీకి పోటీ చేసిన కేసీఆర్ రెండు చోట్ల ఘన విజయం సాధించారు. 2009లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు, హరీశ్‌రావు సిద్దిపేటకు, కేటీఆర్ సిరిసిల్లకు ముగ్గురి నామినేషన్ పత్రాలకు పూజలు చేయించి నామినేషన్ వేశారు. ఈ ఎన్నికల్లో సైతం ఘన విజయం సాధించారు. 2014 సాధారణ ఎన్నికల్లో సైతం ఇక్కడ కేసీఆర్ పూజలు చేసి గజ్వేల్, మెదక్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి విజయం సాధించారు. టీఆర్‌ఎస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో కేసీఆర్ మెదక్ పార్లమెంట్ స్థానానికి రాజీనామా చేశారు. 2018 సాధారణ ఎన్నికల్లో సైతం ఇక్కడ పూజలు చేసిన అనంతరం తన నామినేషన్ వేశారు. ప్రతి ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి ముందు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఇక్కడికి వచ్చి నామినేషన్ పత్రాలకు పూజలు చేయించి అక్కడే సంతకాలు పెట్టి నామినేషన్ వేస్తారు.

### మంత్రి హరీశ్‌రావుకి అచ్చొచ్చింది

సిద్దిపేట ఎమ్మెల్యే, మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు సైతం సెంటిమెంట్ దేవాలయమైంది. 2004 ఉప ఎన్నికల్లో రాష్ట్ర మంత్రిగా ఉన్న హరీశ్‌రావు తొలిసారిగా కోనాయిపల్లి ఆలయంలో తన నామినేషన్ పత్రాలకు పూజలు చేయించి సంతకాలు చేశారు. అనంతరం నామినేషన్ వేసి ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి హరీశ్‌రావుకు సెంటిమెంట్ గుడిగా మారింది. మంత్రి హరీశ్ 2008, 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను సైతం ఇక్కడ పూజలు చేయించి ఎన్నికల్లో నామినేషన్లు వేయిస్తారు.

### అద్భుతంగా పునరుద్ధరించిన ఆలయం

నంగునూరు మండల కోనాయిపల్లి వేంకటేశ్వరాలయం బీఆర్‌ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్, పార్టీకి సెంటిమెంట్ గుడిగా ప్రాచుర్యం పొందింది. ఇక్కడ దేవాలయ ముఖద్వారం దక్షణం వైపు ఉంటుంది. ఇలా దక్షిణం వైపు ఉన్న దేవాలయాలు చాలా అరుదు. అది కూడా ఒక ప్రత్యేకత అని చెప్పుకోవచ్చు. పురాతన ఆలయాన్ని అద్భుతంగా పునరుద్ధరించారు. సీఎం కేసీఆర్ సూచనలతో మంత్రి హరీశ్‌రావు దేవాలయాన్ని రూ. 3 కోట్ల పైగా నిధులు ఖర్చుచేసి గుడిని పునర్నిర్మించారు. పునర్నిర్మాణంలో భాగంగా గుడి నిర్మాణం, ధ్వజస్తంభం, మూలవిరాట్ పాటు ప్రహరీ నిర్మించారు. 2022 సంవత్సరం ఫిబ్రవరిలో ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. మరో రూ.50 లక్షలతో గ్రామంలో కల్యాణ మండపాన్ని సైతం నిర్మించారు.



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి గ్రామ వ్యూ

## సీఎం రాక కోసం భారీ బందోబస్తు

- సీఎం కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ మల్లారెడ్డి



కోనాయిపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆడిషనల్ ఎస్పీ మల్లారెడ్డి, ఏసీపీ సేరేందర్‌రెడ్డి

నంగునూరు, నవంబర్ 3: మండలంలోని కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సీఎం కేసీఆర్ సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. సీఎం కేసీఆర్ తన ఇష్టదైవమైన కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో తన నామినేషన్ పత్రాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శుక్రవారం కోనాయిపల్లిలో ఆడిషనల్ ఎస్పీ మల్లారెడ్డి, ఏసీపీ సురేందర్‌రెడ్డి పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. 250 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. వాహనాల పార్కింగ్, సీఎం కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో రానుండడంతో గ్రామంలో భారికేడ్లను ఏర్పాటు చేశారు. పర్యటన ఏర్పాట్లలో బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు దువ్వల మల్లయ్య, ఎంపీటీసీ నిమ్మ రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.